డిటెక్టివ్ కథ

# పారని పథకం

రచన :
శ్రీ కృష్ణమోహన్

త్రనకు కబురుచేసిన ఆ యువతివంక ఒక సారి పరిశీలనవు చూచాడు డిటెక్టివ్ రవికిషోర్.

ఇరవై రెండు లేక యిరవైమూడు మించని వయస్సు. చాలా అందంగా వుంది, ఆమె ముఖ మండలం విన్నబోయివుంది. ఆమె కళ్ళల్లో భయం ఆందోళన కనుపిస్తున్నాయి.

"జయవంతీ దేవీ! మీరు మిష్టర్ సోహన్‌లాల్‌ను పెళ్ళిచేసుకోగోరినా నన్నారే, ముహూర్తం నిశ్చయించారా" ఆమెవంక సాలోచనగా చూస్తూ అడిగాడు కిషోర్.

"నాకు పెద్దలెవరూ లేరు. మా తల్లీ, తండ్రి నా చిన్నతనంలోనే మరణించారు. మేనత్త ఒకామె వుంది. ఆవిడే నన్ను పెంచి పెద్ద జేసింది. చదువు చెప్పించింది. మాకు చాలా ఆసివుంది. రొఖంకూడా వుంది. మా ఎస్టేటు మీరు చూడలేదు. మేము నివసిస్తున్న బంగళా గాక యింకా ముప్పయిదాకా బంగళాలు, తోటలు వున్నాయి. అద్దెల వల్ల నెలకు ఆరువెలదాకా వస్తుంది. సోహన్ నేను చిన్నప్పుడు కలిసి చదువుకున్నాం. చదువు ముగిసిన పిదప అతను తిరిగి కనిపించలేదు. స్వగ్రామంలోనే వుండి పోయారు. సుమారు ఏడెనిమిది మాసాల క్రితం తిరిగి వచ్చారు. ఆయన, జగదీశ్ కాపాడియాలు జాయంటుగా 'ఎక్స్‌పోర్టు ఇంపోర్టు' వ్యాపారం సాగిస్తున్నారు. ఇక మా వివాహ విషయంలో ముహూర్తాలూ, గుళ్ళో పెళ్ళిళ్లాలాంటి గొడవలేమీ లేవు. 28వ తేదీన 'రిజిష్టర్ మేరేజ్' అని అనుకున్నాం. మా మేనత్త కూడా నామాట కాదనలేదు. పెళ్ళి యింక మూడురోజు లుందనగా యీ ఘోరం జరిగింది" జరిగిన విషయం విపులంగా చెప్పింది జయవంతీదేవి!

"ఆయన మాయమైన విషయం పోలీసులకు తెలియపర్చలేక పోయారా?"

"పోలీసులకు చెపితే ప్రయోజనం మాట ఎలావున్నా, ముందు అల్లరి. ఆర్భాటం జరుగుతుంది. నేను యీ పెళ్ళి మాట ముఖ్యులైన నాస్నేహితురాండ్రందరికీ తెలియజేసాను. 28వ తేదీ రాత్రి పెద్ద విందు ఏర్పాటు కూడా చేశాను. ఇప్పుడు యిది వారికి తెలియటం ఎంత నగుబాటు చెప్పండి. నాకు ఆపద్ధతి ఆలశ్యం అవుతుందని కూడా భయం. మా పొరుగున వున్న రామ్‌చంద్ గారింట్లో ఎనిమిది మాసాల క్రితం దొంగలుపడి చాలా వస్తువులు దోచుకుపోయారు. పోలీసులు యింకా దర్యాప్తు సాగిస్తూనే వున్నారు. ఫలితం శూన్యం. ప్రయివేట్ డిటెక్టివ్‌ని నేను సంప్రదించ కోరిందిందుకనే."

"అయితేవారు కోరినంత డబ్బు యివ్వాలని మీరు యోచన చెయ్యటం లేదుగదా?"

"సోహన్‌లాల్ వునికిని మీరు త్వరలో తెలుసుకోలేకపోతే నేనుఆమొత్తం యివ్వాలనే అనుకుంటున్నాను. పెళ్ళిఖర్చుల కోసం కొంతపైకం బ్యాంకునుంచి తెప్పించాను కొంత యింట్లోవుంది. డబ్బుకోసం ఆయన ప్రాణానికి ముప్పురానివ్వనా?"

డిటెక్టివ్ రవికిషోర్ తన అసిస్టెంట్ గిరిధర్‌ని ఆ టేబిల్‌పై లేఖ తీసి చదవ మన్నాడు. గిరిధర్ లేఖను అందుకుని చదవ సాగాడు.

ఆ లేఖ సోహన్‌లాల్ బిజినెస్ పార్టనర్ జగదీశ్ కపాడియా పేర టైప్ చెయ్యబడి వుంది.

> "శ్రీ జగదీశ్ కపాడియా!"
> జయవంతీ ఎస్టేట్సు,
> బాంద్రా,
> బొంబాయి-12.

'మీ భాగస్వామి అంతర్ధానమైన సంగతి మీరు యీపాటికి గ్రహించే వుంటారు. అతడు నిన్నరాత్రి మీతో మాట్లాడి శ్రీమతి జయవంతీదేవిని కలుసుకోవడానికి బయలుదేరినపుడే అతనిని మేము అడ్డగించి ఆపుచేశాం. ఇప్పుడు అతడు మా ఆధీనంలో వున్నాడు. మీరు మాకు యిరవై వేల రూపాయలు యిస్తేనే మేము అతన్ని వదిలిపెడతాము, పెద్ద వ్యాపారం చేస్తున్న మీకు యిదేమంత పెద్దమొత్తం కాదు."

"మీరు చెయ్యవలసిందల్లా రూపాయ నోట్లు వంద

వంద చొప్పున వున్న రెండువందల కట్టలు తెచ్చి అవి సరిగా వంద వందగా రెండువరుసలుచేసి నలిగిపోకుండా దళసరి క్రాఫ్ కాగితంలో పార్సిల్‌గా కట్టండి. అలా కడితే ఆరంగుళాల వెడల్పు ముప్పై ఆరంగుళాల పొడవుగల పార్సెలుగా తయారవుతుంది. ఈ పార్సెలును తీసుకుని రేపు రాత్రి విక్టోరియా టెర్మినెస్‌నుండి మలాడ్‌కు 9-50 కి బయలుదేరే లోకల్ ట్రైన్‌లో ఫస్టు క్లాస్ కంపార్టుమెంటులో ఎక్కండి. అది ఎప్పుడూ ఖాళీగానే వుంటుంది. బాంద్రా స్టేషన్ దాటగానే యీ నోట్ల పార్సెల్‌ను ఎడమవైపు కిటికీనుంచి బయటకు పెట్టి కొంచెం తేలికగా పట్టుకోండి చాలు. ఓవర్ బ్రిడ్జి దాటేలోగా అది కిందపడిపోతుంది. మీరు యీవిధంగా చేస్తే రాత్రి ఒంటిగంటకు సోహన్‌లాల్‌ను చూడగలరు. అలా చెయ్యకపోయినా, యీ వైనం పోలీసులకు తెలియపరచినా ఎల్లుండి ఉదయం అతని మృత కళేబరం మేము పైన చెప్పిన చోటనే చూస్తారు."

ఇట్లు,
అత్యవసరవాదుల సంఘం.

"ఉత్తరం చాలా తెలివి తేటలుగానే వ్రాసారు. ఈ ప్రబుద్ధులు ఎవరోగాని పద్దులు, లేఖలు బాగా వేయగలిగిన రకంలా తోస్తూంది. ఇది యీవాళ ఉదయం మొదటి పోస్టులో శ్రీ కపాడియాకు అందిందంటారు. కళ్యాణ్ నుంచి 'పోస్టు' చెయ్యబడిన సమయం నిన్న సాయంత్రం 4-30 గంటలు అయితే మిష్టర్ సోహన్‌లాల్ నిన్న సాయంత్రం మిమ్మ కలుసుకున్నారా?" ప్రశ్నించాడు డిటెక్టివ్.

"ఆయన ప్రతి శుక్రవారం సాయంత్రం కాపాడియాగారిని కలుసుకునేందుకు వస్తూంటారు. శుక్ర, శని, ఆది వారాలు పేరుకు ఆయన ఇంట్లో వునికిగాని భోజనం మాయింట్లోనే. కాపాడియా గారు మూడేళ్ళ నుంచి మా తోటలోనే వుత్తరపు వైపు బంగళాలో వుంటున్నారు. సోహన్ నిన్న సాయంత్రం వచ్చాడు. కాస్సేపు కపాడియాతో మాట్లాడి వస్తానన్నాడు. రాత్రి పదకొండు గంటల వరకు చూశాను, రాలేదు.

"శ్రీ సోహన్‌లాల్ కాపురం ఎక్కడ?"

"మాటుంగాలో"

"కంపెనీ ఎక్కడుంది."

"దలాల్ స్ట్రీట్‌లో"

సోహన్‌లాల్‌ను అపహరించక ముందే యీ వుత్తరం పోస్టు చేయ్యబడింది. దీన్ని బట్టిచూస్తే అతన్ని తప్పక అపహరించగలమని ధైర్యం వారికి గట్టిగా ఉన్నట్లు విశదమౌతూంది. ఉదయం—యీ వుత్తరం అందగానే జగదీశ్ కపాడియా దీన్ని మీకు తెచ్చి చూపించారు. అంతేనా?"

"అవును"

"తనకు వ్రాయబడిన లేఖను. ఆయన మీవద్దకు ఎందుకు తీసుకురావాలి?"

"అది సహజమే కదండీ! మా పెళ్ళి విషయం ఆయనకు తెలుసు. ఒకవేళ రాత్రి పొద్దుపోయే వరకు మేము మాట్లాడుకున్న పిదప సోహన్ యిక్కడే నిద్రించి, వుండవచ్చని కూడా ఆయన అనుకోవచ్చు కదా!"

"ఇందాక మీరు త్వరలో ఈ సంగతి తేలకపోతే రేపు డబ్బు తెప్పించి యిద్దామనుకొంటున్నా నన్నారే, మీ రెందు కివ్వాలి?"

"పాపం! కపాడియాగారి దగ్గరేముంది? వ్యాపారం యీ మధ్య అంత బాగలేదని సోహన్‌లాలే నాతో చెప్పాడు. నాకు డబ్బుకు లోటులేదు. నేను యిస్తానని సోహన్‌ని విడిపిద్దామని నేను కపాడియాగారి కప్పుడే మాట యిచ్చాను."

"సరే! నేను ఒకసారి కపాడియాగారిని చూసి కర్తవ్యం నిర్ణయించి చర్యకు దిగుతాను. ఆయన యింటి నెంబరు?"

"72. అదుగో ఆ దారిన రెండు ఫర్లాంగులు వెళ్ళి కుడివైపుకు మళ్ళితే - చివరి బంగళా."

కిషోర్, గిరిధర్‌లు, జగదీశ్ కపాడియాను కలుసుకున్నారు. ఆయనకూడా జయవంతీదేవి చెప్పిన సంగతులే చెప్పాడు.

"మీతో మాట్లాడిన తరవాత సోహన్‌లాల్ ఎన్ని గంటలకు వెళ్ళివుంటాడో చెప్పగలరా?"

"రాత్రి ఎనిమిదిన్నర లేక ఎనిమిదిముప్పావు అయివుంటుంది."

"తిన్నగా జయవంతిదేవిని కలుసుకునేందుకు వెడుతున్నానని ఆయన మీతో చెప్పారా?"

"అవును. రాత్రి తిరిగి వచ్చేసరికి పొద్దు పోవచ్చుననీ, తనకు పక్క బయట వరండాలో ఏర్పాటు చెయ్యవలసిందనీ చెప్పి వెళ్లాడు."

"ఆయనను బెదరిస్తూ యిటీవల ఎవరైనా లేఖలు వ్రాశారేమో మీకు తెలుసా?"

వ్రాసినట్లు తోచదు. ఏంజరిగినా నాతో చెపుతాడు దాపరికం వున్న మనిషి కాదు. యిరవై వేల రూపాయలట అతని వద్ద రెండు వేలు కాదు కనీసం రెండు వందలయినా వున్నాయా అని నా అనుమానం"

"మీ వ్యాపారం నుంచి తీసుకుని యివ్వవచ్చునని ఉత్తరంలో సూచించ బడింది."

"వ్యాపారం అధ్వానంగా వుంది. యీ మధ్య అన్ని ప్రయత్నాలూ నష్టమే తెల్చాయి. రెండు రూపాయలు కూడా లేని పరిస్థితిలో వున్నామని చెప్పచ్చు"

"జయవంతీ దేవిని పెళ్ళి చేసుకో వాలనే అభిప్రాయం మీ భాగస్వామికి ఎన్నాళ్ళ వున్నదో చెప్పగలరా'

"ఆరు మాసాలుగా అతను ఆమె యింటికి జోరుగా వెడుతున్నాడు. కాని పెళ్ళి విషయం యింకా నిర్ణయమైందని గాని కుదిరిందని కానీ వైనం చెప్పలేదు. ఆమెకు మాత్రం అతనంటే చాలా మోజుగా వుంది. అతను వివాహం చేసుకుంటే వ్యాపారంలో పెట్టుబడి సహాయం లభించ వచ్చని నేను ఒకప్పుడు ఆశించాను కాని..."

"నిన్నరాత్రి మీరు ఎక్కడికైనా వెళ్ళారా ?"

"నేనా! ఎక్కడికీ వెళ్ళలేదు. బొంబాయి నుంచి మధ్యాహ్నం రెండు గంటలకే బయలుదేరి వచ్చాను. సోహన్‌లాల్ ఏదో పనులు చూచుకు వస్తానన్నాడు. ఈమధ్యనే వేరుశనగ రవాణాలో గట్టిగా చెయ్యి కాలింది. అబాపతు పేచీలు కొన్ని పరిష్కారం చెయ్యటం విషయమై మార్కెట్లు యింట్సుతో మాట్లాడి రమ్మని నేనే అతన్ని దాచి అతని పేరుతో డబ్బు వసూలు చెయ్య చూస్తున్నానని నన్ను మీరు అనుమానించటం లేదుకదా ?"

"నేను ఏమీ అనుమానించటం లేదు! అవకాశాలు చూస్తున్నాను. మీ బసనుంచి తిన్నగా రోడ్డుమీదకు దారి వుందా? మేము వచ్చినదారి మాత్రమేనా?"

"వుంది! యీ ప్రక్కనుంచి కూడా వెళ్ళవచ్చు. ఇది కాలనీలాగా వుంది. ఒక వైపున జయవంతీదేవి గారి యింటి వైపునుంచి గేటువుంది. మరొక గేటు యిటున్నది."

"అదుగో! అలమారలో కొత్త రైల్వే టైమ్ టేబిల్ ఒకసారి చూడనిస్తారా?"

గిరిధర్ దానిని అందుకున్నాడు.

"9-50 రైలు - అది లోకల్ - అప్ 18 రైలు."

"అయితే రూపాయి నోట్లు మూడు అడుగుల పొడగున అరంగుళాల మందాన పార్సెలు కట్టియిమ్మనడం నాకు అందులో ఆంతర్యం బోధపడటం లేదు కపాడియా అన్నాడు.

"ప్రస్తుతం మాకూ బోధపడ్డం లేదు. మేము వెళ్ళి వస్తాం. ఏం చెయ్యవలసిందీ నిర్ణయించి తిరిగి తెలుసుకుంటా" అంటూ డిటెక్టివ్ రవికిషోర్. అసిస్టెంట్ గిరిధర్ తమ కారులో ఎక్కి కపాడియా యింటి దగ్గరనే వున్న గేటువైపునుంచి వెళ్ళిపోయారు.

* * *

మరునాటి రాత్రి సుమారు తొమ్మిది గంటల సమయంలో బాంద్రా స్టేషన్‌కు రెండు ఫర్లాంగులోవున్న ఓవర్ బ్రిడ్జి పాదలమాటున నల్లసూట్లు ధరించిన మూడు విగ్రహాలు నిలబడి వున్నాయి. వారిచూపు ఓవర్ బ్రిడ్జి మీదనే వుంది. ఇంతలో ఒక వ్యక్తి ఓవర్ బ్రిడ్జిమీదకు వచ్చి నిలబడి బ్రిడ్జి కమ్ములకు ఒక వైరు నోత్రాటినో కట్టుతున్నట్టు కనుపించాడు. ఆ వైరుకు చివర ఒక ఉక్కు గుండువంటిది వుంది. దాని నతడు మెల్లగా క్రిందకు వదిలాడు. ఆ తరువాత వంతెన మీదనుంచి మెల్లగా క్రిందకువచ్చి. రైలు బద్దెల పక్కగావున్న రాళ్ళను తొలగించి ఆ వుక్కుగుండును అక్కడ పెట్టి దానిచుట్టూ రాళ్ళూ యిసుక పోసి అది గట్టిగా నేలకు అదుముకొని వుండేటట్లు చూసి వంతెనమీదకు వెళ్లాడు.

తొమ్మిదీ నలభై ... నలభైఅయిదు... నలభై ఏడు... యాభై ...

నిశ్శబ్ద వాతావరణాన్ని తన ప్రచండ ధ్వనితో చీల్చుకుంటూ లోకల్ ట్రైన్ బాంద్రాలో ఆగింది, ఒక్క నిముషం తరువాత 'ఛో' అని అరుస్తూ బయలు

దేరింది. మైలు దూరంకూడా కనుపించే 'సెర్చిలైటు' కాంతికి పొదల మాటున నిలచిన విగ్రహాలు మూడు అలుకుడు కాకుండా గభాల్ను పొదలకు దగ్గరగా హత్తుకు పోయాయి. బ్రిడ్జి చేరేసరికి తిరిగి కూతపెట్టి ఎలక్ట్రిక్ యింజన్ దణ...దణ శబ్దంతో దూసుకు పోయింది.

రైలుకు చివరివైపున ఫష్టుక్లాస్ కంపార్టుమెంటు కిటికీనుంచి ఒక పొడుగాటి పార్సెల్ బయటకు సాచ బడి వుండటం అది వంతెనకు దగ్గరగా గభీమని క్రింద పడటం పొదలమాటున వున్న విగ్రహాలు ఆదుర్దాగా తిలకించాయి.

వంతెనమీదవున్న వ్యక్తి క్రిందకుదిగి వంగ పార్సెలు మీద చెయ్యివేసాడు. పొదల మాటున మూడు విగ్రహాలు ఒక్క గెంతుతో అతనిముందు వురికాయి ఒక విగ్రహం అతని చెయ్యి గట్టిగా పట్టుకుంది.

"ఇంత రాత్రివేళ యిక్కడేం చేస్తున్నావు" చెయ్యి పట్టుకున్న పోలీసు సార్జెంటు రమేష్ ప్రశ్నించాడు.

"వంతెనమీదనుంచి వంగి రైలుకేసి చూస్తుంటే యీ పార్సెల్ క్రింద పడిపోయింది. వచ్చి దీసుకుంటున్నాను" తెల్లబోయిన వంతెన మీది వ్యక్తి తడబడుతూ సమాధానం చెప్పాడు.

MICO

ఫార్ముల్యేషన్సుకు ఆధారము

ఎండ్రిన్, క్లోర్డెన్, హెప్టాక్లర్
మికోసెన్ బి. హెచ్. సి.
లోపెక్స్‌డిట్ డి. డి. టి.
మరియు మికోడెన్, లిండెన్

మద్రాసు, కుప్పమ్ (ఆంధ్రరాష్ట్రం) ల లోని మా
ఫ్యాక్టరీలలో ఈ ఫార్ముల్యేషన్స్ ఉత్పత్తి చెయ్యబడుతున్నవి.
ఇండియా అంతటగల మా ఆఫీసులు, డిపోలు, ఏజంట్లు సప్లయి చేయుదురు.
ఇంకా వివరాలు కోరువారు: మెసర్, మైసూరు ఇంసెక్టిసైడ్స్ కో,
31-ఏ, నార్త్ బీచ్ రోడ్, మద్రాసు-1.

ప్రొప్రయిటర్స్: మెసర్స్. మైసూరు ఫెర్టిలైజర్ కో, మద్రాసు-1.

టెక్నికల్ అసోసియేట్స్: మెసర్స్. గార్డోవ్ ఇండియా కార్పొరేషన్ ఇన్‌కార్పొరేటెడ్,
82, వాల్‌స్ట్రీట్, న్యూయార్కు-5, N. Y.

“ఏమిటా పార్శిల్‌లో వున్నది?” రెండవ విగ్రహం ప్రశ్న అకంఠం డిటెక్టివ్ రవికిషోర్‌ది.

“మా మిత్రులకు కొన్న క్రిష్టమస్ ప్రజెంట్సు” నంతెన మీదనుంచి దిగివచ్చిన వ్యక్తి సమాధానం.

“బరువుగా వుందే! యిరవై వేలు ఒక రూపాయి నోట్లు కావు గదా?” గిరిధర్ వేళాకోళంగా అన్నాడు పొదమాటున వున్న మూడవ విగ్రహం అతనే.

“ఆ! ఎవరిని! ఏమిటి మీరంటున్నది! నేను ఎవరిని అలా ఎకసక్కెలు చేస్తున్నారు.”

“బలే తెలివైన వాడవు! కాని పాపం! ప్రయోజనం లేని తెలివి?” అన్నాడు సార్జెంటు.

ఆవ్యక్తి హఠాత్తుగా సార్జెంటు చెంపమీద బలంగా కొట్టి పరుగెత్త బోయి గిరిధర్ కాలు అడుగు పెట్టటంతో క్రిదకు తూలాడు. తిరిగి అతడు లేచేలోగా ముగ్గురూ అతని మీద పడ్డారు. కొన్ని నిముషాలు పెనుగులాట తరువాత సార్జెంటు ఆ వ్యక్తికి సంకెళ్లు తగిలించాడు, పెనుగులాటలో వ్యక్తి ధరించిన కళ్ళజోడు టోపీ, మాయ మీసం లాడి క్రింద పడ్డాయి. వాటిని కిషోర్ జాగ్రత్త చేసాడు.

“ఏమిటీ దౌర్జన్యం! నేనేం చేశాను” అరచాడు వ్యక్తి.

సోహన్‌లాల్ అనే వ్యక్తిని హరించిన నేరం, రెండు మోసంచేసి, భయపెట్టి డబ్బులాగడానికి ప్రయత్నం. యీ రెండు నేరాల క్రింద నిన్ను అరెస్టు చేస్తున్నాను. నడు స్టేషనుకు” సార్జెంటు గర్జించాడు.

“లేదు రమేష్! మీరు పొరబడ్డారు! యీయననది మనం ఒకే నేరం క్రింద అరెస్టు చెయ్యాలి. అది ధనాపహరణ మాత్రమే! పాపం సోహన్‌లాల్‌ను మాత్రం యితడు దొంగిలించలేదు” రవికిషోర్ నవ్వుతూ అన్నాడు

“అదెట్లా!” సార్జెంటు ప్రశ్నించాడు.

“ఎలాగంటే! తన్ను తానే అపహరించుకున్న వ్యక్తి సోహన్‌లాల్ యితడే - జయవంతీదేవి యింట్లో యితని ఫొటో చూచాను. మారువేషంలో కూడా గుర్తించాను. అమాయకురాలైన ఓ యువతిని ప్రేమ అనే వలలో చిక్కించి ఆమెనుండి యిరవైవేల రూపాయలు కాజేయటానికి వేసిన మోసపుటెత్తు. పాపం! అతని పధకం పారలేదు.

సోహన్‌లాల్ ఆ రాత్రి బాంద్రా పోలీసు స్టేషనులో బందీ చెయ్యబడ్డాడు.

* * *

విచారణలో సోహన్‌లాల్‌కు అదివరకే పెళ్ళి అయిందనీ, ముగ్గురు పిల్లలనీ, ఈ విధంగా జయవంతీదేవిని వంచించి యిరవైవేలూ తీసుకుని దొంగలు తమ మాటప్రకారం సోహన్‌లాల్‌కు తిరిగి తమకు అప్పగించలేదనే అభిప్రాయం కల్పించి తను తిరిగి కనుపించకుండా ఏ మద్రాసో, కలకత్తాకో, పోయి సుఖంగా కాలం గడప వచ్చునని అతడు పధకం వేసుకున్నట్టు బయట పడింది.

ఈ విషయం అతని భాగస్వామి, జగదీశ్ కపాడియాకు ఎంతమాత్రం తెలియదని కూడా రుజువైంది.

తాను వేసిన పధకం పారకపోగా సుఖ జీవితపు టాశలు వమ్మైన సోహన్‌లాల్ బొంబాయి సెంట్రల్ జైలులో ఏడు సంవత్సరాల కఠినశిక్షను అనుభవిస్తున్నాడు.

‘కృష్ణమోహన్’

ఒక గోల్డ్‌క్యాప్ ఫౌంటెన్ పెన్ ఉచితం





స్విస్ మేక్ రిస్టు వాచీలు. 5 ఏళ్లు గ్యారంటీ. గుండ్రము లేక చతురపు సైజు 15-8-0; 5 జుయెల్స్ లేడిస్ లేక జెంట్స్ రు. 20. 15జుయెల్స్, వాటర్ ప్రూఫ్ 34/- 17 జుయెల్స్ 40/- రెక్టాంగ్యులర్ 5 జుయెల్స్ 24/- రోల్డ్ గోల్డ్ 28/- టైంపిన్ 13/- పోస్టేజి 2/- ఇంగ్లీషులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు.

CALCUTTA WATCH CO (Sec 226)
Post-Box No 12203 Calcutta-5.